ఆంధ్రప్రభ - 21-06-1999

# మంచు శిఖరం

రగ్గు కప్పుకొని, మోకాళ్ల మీద తల ఆన్చి, కిటికీ దగ్గరగా వున్న మంచం మీద కూర్చున్న జయంత్ యేదో తెలియరాని వేదనతో ఆలోచిస్తున్నాడు. కిటికీ అద్దాల్లో గదిలో వున్న వస్తువుల ప్రతిబింబాలు కనిపిస్తున్నాయి. రూమ్‌మేట్ ప్రకాష్ తన పక్క దులిపి వేసుకొని, జయంత్‌ను చూస్తూ అన్నాడు, "నీ వాలకం చూస్తే యీ రాత్రికిక చదివేలా లేవు. లైట్లార్పేస్తున్నా, ఏమంటావు?"

జయంత్ సమాధానమివ్వలేదు.

ప్రకాష్ యిద్దరి బల్లల మీదా వున్న రీడింగ్ లాంప్స్‌ను ఆర్పేసి, తన పక్క యెక్కి రగ్గులో దూరాడు. గదిలో చీకటి కమ్ముకోవటంతో, బయటి మనోహర ప్రకృతి కిటికీ అద్దాల్లోంచి కనబడసాగింది. విరగకాస్తున్న వెన్నెల్లో మంచురేకులు వెండిపూల వర్షంలా కురుస్తున్నాయి. పర్వతశిఖరాలు మంచుతో కప్పబడి ధగధగా మెరుస్తున్నాయి. దిగువగా అగాధమైన లోయలో పారుతున్న నది వెండి రిబ్బనులా తళతళలాడుతూంది. అంతటి మనోహర దృశ్యమూ జయంత్ ఆలోచనలను మళ్లించలేకపోయింది.

ప్రకాష్ జయంత్‌ను ఉద్దేశించి అన్నాడు - "సాయంత్రం నుంచీ నీ తీరు చూస్తే అదోలా వున్నావు. ఇందాకా డైనింగ్ హాల్లో కూడా అన్యమనస్కంగా వుండి భోజనం సరిగ్గా చేశావుగాదు. ఇంటి మీద మనసు మళ్లిందా? మీ అమ్మ కాని జ్ఞాపకాని కొచ్చిందా?" - ఆ మాటల్లో చిన్నగా

ఉడికింపు.

జయంత్ మౌనంగా వుండిపోవటంతో ప్రకాష్ మళ్లీ అన్నాడు - "లేకపోతే మధ్యాహ్నం మనం చూసిన మ్యాటినీ సినిమాలో యెదలెగరేసి, నృత్యాలు చేసి ప్రేక్షకుల్ని అదరగొట్టిన హీరోయిన్ కాని గుర్తుకొస్తోందా?" - ఈ మాటల్లో కాస్త కవ్వింపు!

"అవును ప్రకాష్! నా ఆలోచనల్లో యిద్దరూ చోటుచేసుకున్నారు - ఎందుకంటే... ఆ హీరోయినే నా తల్లి!" జయంత్ బాధగా అన్నాడు.

ప్రకాష్‌కు విషయం అర్థమైంది. తెర మీద హీరోయిన్ నృత్యాలు చూస్తూ ప్రేక్షకులు ఈలలూ, చప్పట్లూ! ఆట అయిన తర్వాత హాలు బయటికి వస్తున్న జనం అసభ్యమైన ప్రేలాపనలు! తనూ, తన స్నేహితులూ కూడా అప్పుడప్పుడు నోరు జారిన సంగతి గుర్తుకొచ్చింది.

"నువ్వు రానని ఎంత గోలపెడుతున్నా బలవంతంగా తీసుకుపోయాం. ఎందుకు రావన్నావో యిప్పుడర్థమైంది. సారీ జయంత్, తెలియక నేనూ నోరు జారాను. క్షమించు!" అన్నాడు ప్రకాష్ క్షమాపణ కోరుతూ.

జయంత్ మళ్లీ మౌనం వహించాడు.

ప్రకాష్ కాస్త తటపటాయిస్తూ అన్నాడు - "మీ తండ్రే కనుక నటుడైతే నువ్వింతగా ఆలోచించే వాడివా?"

"నువ్వన్నది నిజమేనేమో?" జయంత్ నెమ్మదిగా అన్నాడు.

"మరి? కళాకారులన్న తర్వాత వాళ్ల మీద ప్రేక్షకుల అభిప్రాయాలు రకరకాలుగా వ్యక్తమవుతాయి. దానికి ఎవరూ చేయగలిగిందేమీ లేదు! నీ తల్లి ఓ కళాకారిణి అని సర్దుకుపోవాలే కాని, ఇలా మనసు పాడుచేసుకొని కూర్చుంటే, రాబోయే పరీక్షల సంగతేం చేస్తావు?"

"జ్ఞానమొచ్చిన తర్వాత యితర సినిమాలు చూసిన నాకు, గతంలో మా అమ్మ నటించిన సినిమాలు చూడ్డానికి అసలు మనసొప్పదు. ఈ రోజునే మొదటిసారిగా మీ బలవంతం మీద చూడవలసి వచ్చిందంటే నమ్మవేమో! ఇతర ప్రేక్షకుల స్పందన గురించి నాకు బాధ లేదు గాని, 'తెర మీద తల్లి చేస్తున్న విన్యాసాలు చూసి, ఓ తనయుడు ప్రేక్షకుడుగా ఏ విధంగా స్పందించాలి?' అన్న ప్రశ్నే వేధించుకు తింటోంది! సరేలే, ఈ విషయం ఎవరితోనూ చెప్పకు. ఏదో కాస్త మనసు కుదుట పడుతుందని నీతో చెప్పాను" అన్నాడు జయంత్, కాళ్లు చాచి పక్క మీద వాలుతూ.

"ఎవరికీ చెప్పను కాని, ఒక్కరికి మట్టుకు చెప్పి హెచ్చరించక తప్పదు! మా అక్క సినిమాల్లో చేరాలని తెగ ఉబలాటపడ్తోంది!"

ఇద్దరూ నిద్రలోకి జారుకున్నారు.

స్త్రీకి మాతృత్వమనే మంచు ముసుగు కప్పి అత్యున్నత శిఖరాల మీద నిలబెట్టిన పురుషాధిక్య సమాజానికి, మంచు కరిగిన శిఖరాల్ని చూడటానికి మనసొప్పదు. అందుకనే అన్నట్లుగా ముస్సోరి పర్వత శిఖరాల మీద మంచు కురుస్తూనే వుంది.